ప్రజాశక్తి
మంగళవారం 9 జులై 2024
5
అల్లూరి సీతారామరాజు

ఎపి పీజీ సెట్ ర్యాంకర్ బలరాంకు సన్మానం

ప్రజాశక్తి -హుకుంపేట:ఏపీ పీజీ సెట్ ర్యాంకర్, అరకులోయ మండలం పద్మాపురం చెందిన కుర్ర బలరాంను ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కొట్టగుల్లి. సింహాచలం నాయుడు, స్థానిక సర్పంచ్ వెంకటపూర్ణిమలు సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, ఉన్నత చదువులపై దృష్టి సారించలన్నారు. ఈ కార్యక్రమంలో తీగల వలస మాజీ సర్పంచ్ పల్టాసింగి. కామేశ్వరరావు, హుకుంపేట వార్డు మెంబెర్ పాడి వెంకటేష్, టీడీపీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

సన్మానిస్తున్న సర్పంచ్, ప్రిన్సిపాల్

డ్రగ్స్‌ను పూర్తిగా నిర్మూలించాలి

- మహిళల సమస్యలపై ఐక్య పోరాటాలు - ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

ప్రజాశక్తి-అరకులోయరూరల్:గంజాయి, మద్యం, మత్తు పదార్థాలు పూర్తిగా నిర్మూలించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి డిమాండ్ చేశారు. అరకులోయ ఆదివాసీ గిరిజన సంఘం భవనంలో ఆదివాసీ గిరిజన మహిళా సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న జిల్లా స్థాయి శిక్షణ తరగతులకు ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మహిళలు ఇంటా బయటా హింస, అత్యాచారాలకు గురవుతున్నారని, వీరికి రక్షణ లేకుండా పోయిందన్నారు. గంజాయి, మద్యం, మత్తు పదార్థాలు పూర్తిగా నిర్మూలించాలని పోరాటాలు చేస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకో లేదన్నారు. కుటుంబాలలో స్త్రీకి పురుషులతో సమాన హక్కులు, తల్లిదండ్రుల ఆస్తిలో సమాన వాటా ఇవ్వాలని చట్టం ఉన్నపటికీ ఆడపిల్లలకి సమానంగా పంచే పరిస్థితి లేదని చెప్పారు. స్త్రీలకు పని ప్రదేశాల్లో తగు రక్షణ కల్పించి పురుషులతో సమానంగా స్త్రీలకు కూలి రేట్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు.రాష్ట్రంలో మిడ్ డే మీల్స్, ఆశా, అంగన్వాడిలుగా మహిళలు తక్కువ వేతనాలకే పని చేస్తున్నారన్నారు. కనీస వేతనాలు అమలు చేయలేదని, శ్రమ ఎక్కువ వేతనం తక్కువతో అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. శ్రామిక మహిళల సమస్యల పరిష్కారానికి గిరిజన మహిళా సంఘం నిరంతరం ఐక్యంగా పోరాటం చేస్తోందని చెప్పారు.ప్రతి మహిళకి పని కల్పించినప్పుడే మహిళల సంపూర్ణ సాధికారత జరిగినట్టేనన్నారు. రోజు రోజుకు పెరుగుతున్న అధిక ధరలు కుటుంబాలకు భారంగా మారుతున్న పరిస్థితి వచ్చిందన్నారు. భవిష్యత్తులో మహిళలందరినీ చైతన్యం చేసి ఐక్యంగా ముందుకు సాగడానికి పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు టి.కౌసల్య, జిల్లా సెక్రెటరీ ఎస్.హైమావతి, ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యులు వి.వి.జయ, గిరిజన మహిళా సంఘం జిల్లా ఉపాధ్యక్షులు శశికళ, జిల్లా జాయింట్ సెక్రెటరీ కుమారి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

మినుములూరు పిహెచ్‌సిలో సిబ్బంది కొరత

- కుంటుపడిన ప్రజారోగ్యం

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు మండలంలో ప్రధానమైన మినుములూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సి)లోని క్షేత్రస్థాయి వైద్య సిబ్బంది కొరత ఏర్పడిందిజ దీంతో పలు సచివాలయాల పరిధిలో ప్రజారోగ్య సేవలు కుంటుపడ్డాయి. ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో సుమారు 55 వేల జనాభా ఉన్నారు. మొత్తం 12 సచివాలయాలు ఉన్నాయి. ప్రతి సచివాలయానికి ఒక (మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్), ఎంపీహెచ్ఏ (మేల్), మరో ఇద్దరు ఎంపీహెచ్ఏ (ఫిమేల్)చొప్పున మొత్తంగా 36 మంది వైద్య ఆరోగ్య సిబ్బంది విధులు నిర్వర్తించవలసి ఉంది. ప్రస్తుతం ఈ సచివాలయాల పరిధిలో కేవలం 16 మంది క్షేత్రస్థాయి సిబ్బంది మాత్రమే ఉన్నారు.

ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సిహెచ్ఓ) ఎంపీహెచ్ ఈవో పోస్టులు కూడా ఖాళీగానే ఉన్నాయి. క్షేత్ర స్థాయి సిబ్బంది కొరత వల్ల వైద్య సేవలు కుంటుపడగా వీటిని పర్యవేక్షించాల్సిన పీహెచ్ స్థాయి అధికారులు కూడా లేకపోవడం మరింత విశేషం.

ఈ పీహెచ్సీ పరిధిలోని మినుములూరు, వంతాడపల్లి, గొండేలి, ఆరోగ్య ఉప కేంద్రాలకు ఒక్క హెల్త్ అసిస్టెంట్ కూడా లేకపోవడంతో ఈ ప్రాంతంలో ప్రజారోగ్య సేవలు కుంటూ పడ్డాయి. 35 గ్రామాలు కలిగిన హెడ్ క్వార్టర్ మినుములూరులో ఏఎన్ఎం, హెల్త్ అసిస్టెంట్ లేకపోవడం పట్ల వైద్య సేవల కోసం గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు.సిబ్బంది కొరత ఉండటంతో పీహెచ్సీలోని ఉన్న సిబ్బందిపై అధికారుల ఒత్తిడి, అదనపు క్షేత్రస్థాయి పర్యటనలు, అన్ లైన్ పనుల భారం పడుతూ మానసికమైన క్షోభకు గురి అవుతున్నామనీ పలువురు సిబ్బంది తెలియజేస్తున్నారు. ఎక్కువ మందిని డిప్యూటేషన్లపై ఇతర ప్రాంతాల్లో నియమించడంతో ఈ పిహెచ్సిలో సిబ్బంది కొరత ఎక్కువైందని పలువురు తెలిపారు.

వైద్య సిబ్బందిని భర్తీ చేయాలి : సిఐటియు

గ్రామాల్లో వివిధ వ్యాధులతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. అధికారులు దీనిపై దృష్టి సారించాలి. ప్రస్తుతం అంతటా మలేరియా కేసులు అధికంగా నమోదు అవుతున్న తరుణంలో జిల్లా అధికారులు ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది కొరతపై దృష్టి పెట్టక పోవడం సరి కాదు.

ఎల్ సుందర్రావు, సిఐటియు మండల కార్యదర్శి

సమావేశంలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఓ సూరజ్ గనోరే

పనులు సకాలంలో పూర్తి చేయాలి

ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీలోని వివిధ ఇంజనీరింగ్ విభాగాల ద్వారా చేపట్టిన పనులన్నీ త్వరితగతిన పూర్తి చేయాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే సంబంధిత అధికారులను ఆదేశించారు. ఏజెన్సీ ఏడు మండలాల్లో రోడ్లు, భవనాల పురోగతిపై ఐటిడిఎ పిఒ సోమవారం తన ఛాంబర్లో గిరిజన సంక్షేమం, పంచాయతీరాజ్, రోడ్లు భవనాల శాఖల ఇంజనీర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ విభాగం ద్వారా చేపట్టిన గోకులాల షెడ్ల నిర్మాణం, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల భవనాలు, వంతెనలు తదితర పనులు ఏ స్టేజ్‌లో ఉన్నాయో పిఒ సమీక్షించారు. అలాగే పంచాయతీరాజ్, రోడ్లు భవనాల శాఖ ద్వారా చేపట్టిన పనుల తీరుపై ఆరా తీశారు. కొత్తగా కట్టిన భవనాలకు రంగులకు, కూలీలకు, సిమెంట్, ఇసుక వంటి వాటికి ఎంతెంత ఖర్చవుతుందో శాఖలవారీగా సమీక్షించారు. గిరిజన సంక్షేమ, పంచాయతీరాజ్, రోడ్డు భవనాల శాఖల ద్వారా కొత్తగా ఏయే పనులకు ప్రతిపాదనలు తయారు చేయాలో అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఇంజనీర్లు గౌతమి, చైతన్య, సాయి సతీష్, ఏఈలు సత్యనారాయణ, భాను, ఉమామహేశ్వరరావు, పి.వెంకటేశ్వరరావు, ప్రదీప్ పాల్గొన్నారు.

మూగజీవాలకు టీకాలు

ప్రజాశక్తి -అనంతగిరి:అనంతగిరి పశువైద్య కేంద్రం పరిధి గోమంగిపాడు, కొండిభ పంచాయతీ గర్రిగడ్డిలో పశువులు, మేకలకు వ్యాధి నిరోధక టీకాలు వేశామని పశువైద్య అధికారి సందీప్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మేకలు, పశువులు ఇబ్బంది పడుతున్నట్లు తమ దృష్టికి రైతులు తీసుకు రావడంతో సోమవారం వెటర్నరీ అసిస్టెంట్‌ల రెండు బృందాలను పంపించడం జరిగిందని తలిపారు. చిన్నపాటి వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే వెటర్నరీ సిబ్బందికి సమాచారం అందించాలని సూచించారు.

టీకాలు వేస్తున్న వెటర్నరీ అసిస్టెంట్

వినతిపత్రం అందజేస్తున్న ఎపి ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు

ఇంజినీరింగ్ పనులు వేగవంతం చేయండి

కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి - పాడేరు: జిల్లాలో జరుగుతున్న ఇంజినీరింగ్ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో పాడేరు, రంపచోడవరం, చింతూరు డివిజన్లలోని గిరిజన సంక్షేమ శాఖ, పంచాయతీ రాజ్, పిఐయు, రహదారులు భవనాల శాఖ ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లతో పనుల పురోగతి, పెండింగ్ బిల్లులపై సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విద్యా మౌలిక సదుపాయాలు, సిసిడిపిలో చేపట్టిన పనులు, ఎస్.సి.ఏ, ఆర్టికల్ 275, ప్రధాన మంత్రి జన్‌మన్, ఎన్ఆర్ హెచ్ ఎం, స్వాతంత్ర సమర యోధుల మ్యూజియం నిర్మాణాల ఎం.బుక్ రికార్డింగ్, బిల్స్ అప్లోడింగ్, పెండింగ్ బిల్లులపై ఆరాతీసారు. ఏకలవ్య మోడల్ స్కూల్సు, గోకులం షెడ్ల నిర్మాణాలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. నిర్మాణ పనులలో నాణ్యత పాటించాలని ఆదేశించారు. బిల్లులు సిద్ధం చేయడంలో ఎక్కడా జాప్యం చేయకూడదని చెప్పారు. చింతూరు డివిజన్ పరిధిలోని తుఫాను ప్రభావిత ప్రాంతాలలో రోడ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలన్నారు. కాంట్రాక్టర్లకు పెండింగ్ బిల్లులకు ప్రభుత్వం నిధులు విడుదల చేస్తోందన్నారు. బిల్లుల చెల్లింపులకు అవసరమైన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపిస్తున్నామని చెప్పారు. రూడకోట బర్త్ వెయిటింగ్ హాలు నిర్మాణం పూర్తి చేయడానికి నిధులు విడుదల చేయాలని పాడేరు ఐటిడిఏ పిఓకు సూచించారు. ఈ సమావేశంలో పాడేరు ఐటిడిఏ పిఓ వి.అభిషేక్, రంపచోడవరం పిఓ సూరజ్ గనోరే (పర్చువల్), ఇఇలు రాజు, వేణుగోపాల్, మురళి, కొండయ్య పడాల్, శ్రీనివాసరావు, మూడు డివిజన్ల అధికారులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

తునికాకు కార్మికులకు బకాయిలు చెల్లించాలని వినతి

ప్రజాశక్తి-చింతూరు

తునికాకు కార్మికులకు చెల్లించాల్సిన డబ్బులు తక్షణమే ఇవ్వాలని కోరుతూ చింతూరు డిఎఫ్ఓ కార్యాలయంలో డివిజన్ అధికారికి ఎపి ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా నాయకులు సీసం సురేష్ మాట్లాడుతూ ఈ ఏడాది మే మొదటి వారంలో ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులు సేకరించిన తునికాకు కట్టకు రూ.3.70 చొప్పున ప్రభుత్వం చెల్లించాల్సిన డబ్బులు ఇంకా చెల్లించలేదని పేర్కొన్నారు. కల్లాలలో కార్మికులకు లక్షల రూపాయలు పెండింగ్లో ఉన్నాయని, అరకొరగా మాత్రమే డబ్బులు ఇచ్చి కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మే నెల మొదటి వారంలో తునికాకు సేకరణ జరిగితే రెండు నెలలు పూర్తయినా ఇంకా కార్మికులకు డబ్బులు ఇవ్వకపోవడం దారుణమన్నారు. కార్మికులు సేకరించిన తునికాకు ద్వారా వచ్చే లాభాలను ప్రభుత్వం గడిస్తూ కార్మికులకు ఇచ్చే డబ్బులపై శ్రద్ధ పెట్టడం లేదని వాపోయారు. అలాగే 2012 నుండి పెండింగ్ బోనస్‌ను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు కారం సుబ్బారావు, పాండు నారాయణ, షోడే, రాఘవయ్య, కారం మనోజ్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

తొలగింపుపై నిలదీస్తున్న స్థానికుడు

గిరిజనుల నిర్మాణాలు తొలగింపు

ప్రజాశకి-హుకుంపేట: హుకుంపేట పంచాయితీలో గ్రామసభ జరుగుతుండగా మరోపక్క గిరిజన మహిళ కోరభు సుహాసిని, భర్త కొటిబాబు నిర్మించుకున్న నిర్మాణాలను రెవెన్యూ అధికారులు సోమవారం ఉదయం తొలగించారు. ఆదివాసి గిరిజనులు నిర్మించిన షెడ్డును రేకులు తొలగించడం హేయమైన చర్య అని ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి తాపుల. కృష్ణారావు, మండల అధ్యక్షుడు రామారావు ప్రకటనలో పేర్కొన్నారు. గిరిజనేతరుల అక్రమ నిర్మాణాలకు సంపూర్ణ మద్దతు తెలియజేస్తూ నిజమైన ఆదివాసి గిరిజనులకు అన్యాయం చేస్తున్నారన్నారు. స్వయం ఉపాధి పొందడం కోసం సుహాసిని కుట్టుమిషన్, భర్త మైక్ అండ్ లైటింగ్ సామానులు పెట్టుకోవడానికి 2004 సంవత్సరంలో ఒక దుకాణం నిర్మించు కొన్నారు. ఇది అక్రమ నిర్మాణం అని వాటిని తొలగించడానికి అధికారులు పూనుకోవడం సమంజసం కాదన్నారు. మండల కేంద్రంలో విపరీతంగా గిరిజనేతరులు అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారని తెలిపారు.. అనేక మార్లు ఆదివాసీ గిరిజన సంఘం నేతలు పిర్యాదు చేసిందని వారు గుర్తు చేశారు.కనీసం స్పందించిన పాపాన పోలేదని మండి పడ్డారు. గిరిజనులు నిర్మించుకున్న ఐదు నిర్మాణాలను కూల్చి వేయడం దుర్మార్గమైన చర్య అన్నారు.

ప్రతి నిర్వాసిత కుటుంబానికీ న్యాయం చేయాలి

రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల రాష్ట్ర నేతలు ప్రభాకర్‌రెడ్డి, సుబ్బారావు

ప్రజాశక్తి- కూనవరం

పోలవరం ప్రాజెక్ట్ వల్ల నష్టపోతున్న ప్రతి నిర్వాసిత కుటుంబానికి న్యాయం జరిగే విధంగా చూడాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మండలంలోని 41 కాంటూరు పరిధిలో ఉన్న బొజ్జరాయిగూడెం, రేపాక, పల్లూరు గొమ్ము, అయ్యవారిగూడెం తదితర గ్రామాల్లో వారు పర్యటించి ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంటూరు పేరుతో పోలవరం ప్రాజెక్టు ముంపు బాధితులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్యాయం చేస్తున్నాయన్నారు. కాంటూరుతో సంబంధం లేకుండా ప్రతి ముంపు బాధితునికీ ప్యాకేజీ ఇవ్వాలని, గ్రామాలు ఖాళీ చేసే నాటికి 18 ఏళ్లు నిండిన యువతీ యువకులందరికీ ఈ ప్యాకేజీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. పోలవరం ముంపు ప్రజల కోసం నిర్మించిన పునరావాస కాలనీలు గతంలో వచ్చిన వరదలకు మునిగిపోయాయని, దీనిపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరారు. ముంపు ప్రాంతాల్లో ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టడం లేదని, రైతులకు సబ్సిడీలు, రైతు భరోసా వంటివి వర్తించడం లేదని, ప్రజలకు బ్యాంకు రుణాలు కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రస్తుత ప్రభుత్వాలకు పోలవరం ప్రాజెక్ట్ మీద ఉన్న శ్రద్ధ నిర్వాసితులకు న్యాయం చేయడం మీద లేదన్నారు. ఎంతసేపు స్పిల్ వే, కాఫర్ డ్యామ్ అంటున్నారు తప్ప, ముంపు బాధితులకు ప్యాకేజీ ఇవ్వడం గురించి మాట్లాడడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా ముంపు బాధితులకు న్యాయం జరిగిన తర్వాతే ప్రాజెక్ట్‌ని నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య, సర్పంచ్ నాగమణి, అమ్మాజీ, నాయకులు నానుపల్లి వెంకటేశ్వరావు, శ్రీనివాసరావు, ఉపేంద్ర, మురళి, నాయకులు పాల్గొన్నారు.

నిర్వాసితులతో మాట్లాడుతున్న రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు

విద్యార్థిని ప్రశ్నలు అడుగుతున్న హెచ్ఎం

సమయపాలన పాటించకుంటే ఫిర్యాదు

ప్రజాశక్తి- అనంతగిరి: ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు సమయపాలన పాటించడంలో నిర్లక్ష్యం వహిస్తే జిల్లా ఉన్నతాధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయక తప్పదని అనంతగిరి స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం విమలకుమారి అన్నారు. ఆమె ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సోమవారం లక్ష్మీపురం జిపిఎస్‌టి డబ్ల్యూ ప్రాథమికలో తనిఖీ నిమిత్తం 9 గంటల వెళ్లాననారు.విద్యార్థులు పూర్తిస్థాయిలో హాజరై ఉన్నప్పటికీ ఉపాధ్యాయుడు మాత్రం 10 గంటలు అవుతున్నప్పటికీ విధులకు హాజరు కాలేదన్నారు.తానే ప్రతిజ్ఞ కార్యక్రమం చేపట్టించడం జరిగిందన్నారు. విద్యార్థులు కనీసం చదవలేని పరిస్థితిలో ఉన్నారని తెలిపారు. ఇప్పటికైనా విద్యార్థులకు సరిగా బోధించాలని సూచించారు.

'పబ్లిక్ గ్రీవెన్స్'కు 47 అర్జీలు

ప్రజాశక్తి-రంపచోడవరం

స్థానిక ఐటిడిఎ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్)లో పలు సమస్యలపై ప్రజలు 47 అర్జీలు సమర్పించారు. వీటిని రంపచోడవరం సబ్ కలెక్టర్ యస్.ప్రశాంత్ కుమార్, ఐటిడిఎ పరిపాలనాధికారి డిఎస్‌వి.రమణ స్వీకరించారు. వై.రామవరం మండలం ఎగువ ప్రాంతం బొడ్డగండి గ్రామంలో కమ్యూనిటీ భవనం ఏర్పాటు చేయాలని, మెట్టగూడెం నుండి పులికొండ వరకు మూడు కిలోమీటర్లు మెటల్ రోడ్డు నిర్మించాలని, మంగంపాడు గ్రామంలో చెక్ డ్యామ్‌కు మరమ్మతులు చేయించాలని, బోడ్డగండి పంచాయితీలోని 19 గ్రామాల్లోని కొండరెడ్డి కులస్తులకు పక్కా గృహాలు మంజూరు చేయాలని వినతిపత్రాలు అందజేశారు. మారేడుమిల్లి మండలం పొట్లవాడ గ్రామం నుండి కెచ్చేలవాడ గ్రామాల మధ్యలో కాలువపై వంతెన నిర్మించాలని, మెటల్ రోడ్డు ఏర్పాటు చేయాలని, కెచ్చెలవాడ పాఠశాలకు, అంగన్వాడీ కేంద్రానికి పక్కా భవనాలు నిర్మించాలని అర్జీలు సమర్పించారు. వై రామవరం మండలం పాతకోట పంచాయతీ పరిధి గోరుకుల గొంది నుండి పాతకోట వరకు సుమారు 7 కిలోమీటర్లు మెటల్ రోడ్డు ఏర్పాటు చేయాలని దరఖాస్తు సమర్పించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాన్ రాజ్, పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే కె.దేవేంద్రడు, ఎడిఎంహెచ్ఒ జి.శిరీష, ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు, వెలుగు ఎపిడి ఎ.శ్రీనివాసరావు, డిఎల్‌పిఓ రాఘవన్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల విద్యార్థుల సమస్యలపై...

మారేడుమిల్లి : మారేడుమిల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని పబ్లిక్ గ్రీవెన్స్‌లో సబ్ కలెక్టర్‌కు ఎన్‌డిఎ కూటమి నాయకులు వినతిపత్రం అందజేశారు. తరగతి, హాస్టల్ గదులు నిర్మించాలని, తాగునీటి సమస్యను పరిష్కరించాలని, బాలికలకు, బాలురకు హాస్టల్ వసతులు కల్పించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో కూటమి నాయకులు పల్లాల రాజ్ కుమార్ రెడ్డి, గురుకుశ కుమార్, మల్లా దుర్గాప్రసాద్, కర్రి సన్యాసిరెడ్డి, భీసెట్టి సత్య, కోండ్ల శివశంకర్ రెడ్డి పాల్గొన్నారు.

ఆట స్థలం కేటాయించాలని...

దేవీపట్నం : మండలంలోని ఇందుకూరు గ్రామంలో అధికారికంగా ఆట స్థలం కేటాయించాలని కొండదొరల సంఘం నాయకులు సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్‌లో సబ్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. దీనికి స్పందించిన ఆయన త్వరలోనే ఆట స్థలం కేటాయిస్తామని హామీ ఇచ్చారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సంఘం నాయకులు యలగాడ నాగేశ్వరరావు, తెల్లం శేఖర్, దూసరి హరిబాబు, కొల్లాపు శ్రీధర్, టెంకి రాంబాబు, బండారు వీరబాబు, దూసరి రమేష్, కొట్టం రాజాశంకర్ దొర, సుంద్రు రవి, ఈరేటి మణి, మన్నేపల్లి నాగేంద్రబాబు, బేలుం అజయ్, పూసం గాంధీ తదితరులు ఉన్నారు.

ఆట స్థలం కోసం వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

12న అపోలో ఫార్మసీలో ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి-రంపచోడవరం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ (ఎపిఎస్ఎస్‌డిసి) ఆధ్వర్యాన అపోలో ఫార్మసీలో ఉద్యోగాల భర్తీ నిమిత్తం స్థానిక యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో ఈనెల 12వ తేదీన శుక్రవారం ఉదయం 10 నుండి మధ్యాహ్నం 3గంటల వరకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి జి.ప్రశాంత్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 18 నుండి 30సంవత్సరాల మధ్య గల పదవ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, బిఫార్మాసీ పూర్తి చేసిన నిరుద్యోగ యువతీ యువకులు ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు. ఇంటర్వ్యూలకు వచ్చే వారు పాన్ కార్డు, ఆధార్ కార్డు, సరిఫికెట్స్ జెరాక్స్ కాపీలు తీసుకొని రావాలన్నారు. ఎంపిక కాబడిన అభ్యర్థులకు నెలకు రూ.10వేలు నుండి రూ.15వేలు వరకు జీతం ఇవ్వటం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగ పరుచుకోవాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు www.skilluniverse.apssdc.in, లేదా 919398338105 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

ముందుగానే నిత్యావసరాలు అందిస్తాం

ప్రజాశక్తి-విఆర్.పురం

ముంపునకు గురవుతున్న గ్రామాలు ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ముందుగానే బియ్యం, ఇతర నిత్యావసర సరుకులు, బరకాలు అందిస్తామని తహశీల్దారు సయ్యద్ మౌలానా పాజిల్ తెలిపారు. రాబోవు వరదలను దృష్టిలో పెట్టుకుని చేపట్టాల్సిన సహాయక చర్యలపై సోమవారం మండలంలోని వడ్డుగూడెం సచివాలయం, విఆర్.పురం గ్రామంలోనూ గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏమైనా సమస్యలుంటే నేరుగా తనకు తెలియజేయవచ్చని చెప్పారు. వరదల సమయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పడవలు, పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. గ్రామస్తులు మాట్లాడుతూ కిరోసిన్, దోమతెరలు, తార్పాలిన్లు, సోలార్ లైట్లు, 3 నెలల రేషన్ సరుకులు ముందుగానే అందించాలని కోరారు. ఈ గ్రామసభల్లో జెడ్పిటిసి వాళ్ల రంగారెడ్డి, సర్పంచి నరసమ్మ, ఎంపీటీసీ, పంచాయతీ కార్యదర్శులు, విఆర్‌ఒలు, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

గ్రామ సభలో మాట్లాడుతున్న తహశీల్దారు సయ్యద్ మౌలానా పాజిల్

రోడ్డు పనులు పూర్తి చేయాలి

ఇఇకి వినతి పత్రం అందిస్తున్న సర్పంచ్, గ్రామస్తులు

ప్రజాశక్తి-అరకులోయరూరల్:మండలంలోని మాదల పంచాయతీ దాబుగుడ రోడ్డు పనులు పూర్తి చేయాలని సర్పంచ్ శ్రీనివాసరావు, గిరిజన సంఘం నాయకులు కె రమేష్, గ్రామస్తులు ట్రైబల్ వెల్ఫేర్ జెఇ అభిషేక్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తోటవలస నుండి దాబుగూడ వరకు సుమారు నాలుగు కిలమీటర్ల వరకు 2014 సంవత్సరంలో తారు రోడ్డు మంజూరు అయ్యిందని తెలిపారు. అధికారుల పర్యవేక్షణ, నిర్లక్ష్యంతో గుత్తేదారుడు నిర్మాణ పనులు మధ్యలోనే నిలిపేశార న్నారు. 2014వ సంవత్సరంలో రోడ్డు శంకుస్థాపన చేసారని, నేటికి పదేళ్లు అవుతున్నా రోడ్డు పనులు పూర్తి చేయలేదని తెలిపారు. సరైన రోడ్డు మార్గం లేక గర్భిణీ స్త్రీలకు అత్యవసర సమయంలో ఆసుపత్రికి తీసుకెళ్లడానికి అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రహరీ నిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: ఎంపీడీఓ కార్యాలయంలో ప్రహరీ గోడ నిర్మాణానికి విశాఖ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ సుభద్ర సోమవారం భూమి పూజ చేసి నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మండల ప్రజా పరిషత్ కార్యాలయానికి పరారీ లేక ఉద్యోగులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా పరిషత్ నిధులు రూ. 33 లక్షలు కేటాయించడం జరిగిందని తెలిపారు. త్వరితగతిన ప్రహరీ నిర్మాణ పనులు చేపట్టి సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అరిసెల సీతమ్మ, ఎంపీడీఓ కె,కిరణ్ కుమార్, వైసీపీ మండల అధ్యక్షులు పి పద్మారావు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ ఆధార్

నేటి నుండి డోర్ టు డోర్ సర్వే
జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-పాడేరు: జిల్లాలో ప్రతి ఒక్కరికీ ఆధార్ చేయించాలని, ఇది వరకే ఆధార్ నమోదై పది సంవత్సరాలు దాటిన వారికి మరోసారి అప్డేట్ చేయించి బయో మెట్రిక్ చేయించాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఎంపిడిఒలను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలక్టరేట్ నుండి ఐటిడిఎ పిఒలు, అన్ని మండలాల ఎంపిడిఓలు, తహసిల్దార్లతో నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ, ఆధార్ లేక ఏ ఒక్కరూ ప్రభుత్వ పథకాలకు దూరం కాకూడదని స్పష్టం చేసారు. సచివాలయాల పరిధిలో ఎఎన్ఎంలు మినహా సచివాలయ సిబ్బందితో ఇంటింటా సర్వే నిర్వహించాలన్నారు. మండలంలో ఎప్పుడు ఎక్కడ అదార్ క్యాంప్ నిర్వహించేది షెడ్యూల్ తయారుచేసి ప్రచారం చేయాలని సూచించారు. వివిధ సాంకేతిక కారణాలతో తిరస్కరణకు గురైనందున సుమారు 5,164 మందికి అదార్ పెండింగ్ ఉన్నట్లు తేలిందని తెలిపారు. ఇటీవల జరిగిన ఎన్నికలలో ఖర్చుకు సంబంధించిన బిల్లులను వెంటనే సమర్పించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారులను, నియోజక వర్గ ప్రధాన కేంద్రం తహసిల్దార్లను కలెక్టర్ ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా నుండి సంయుక్త కలెక్టర్ భావన వశిష్ట్, డిఆర్ఓ బి.పద్మావతి, డిపిఓ కొండలరావు, డివిజనల్ పంచాయతి అధికారి వి.ఎస్. కుమార్, జిల్లా విద్యా శాఖాధికారి పి. బ్రహ్మాజీ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి జమాల్ బాష, వార్డు సచివాలయాల జిల్లా కో ఆర్డినేటర్ కే. సునీల్, పిఎంయు ప్రోగ్రాం అధికారి రామ్ గోపాల్, ఐటిడిఎల నుండి ప్రాజెక్ట్ అధికారులు వి.అభిషేక్, సూరజ్ గనోరే, ఎంపిడిఓలు, తహసిల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయునికి యుటిఎఫ్ నేతల సన్మానం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:మండల కేంద్రంలోని కేంద్రీకృత ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయునిగా పని చేస్తూ పదవి విరమణ చేసిన కమ్మిడి శర్మయ్యకు సోమవారం అరకులోయ ఏపీ టూరిజం గోష్టిలో ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా డుంబ్రిగుడ మండల శాఖ ఆధ్వర్యంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి.మహేశ్వరరావు జిల్లా కౌన్సిలర్లు ఎస్.కన్నయ్య, మండల ప్రధాన కార్యదర్శి ఎస్.బాలకృష్ణలు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంజీవరావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న డిఎం అండ్ హెచ్ఒ

సత్వరమే వైద్యం చేయించుకోవాలి

ప్రజాశక్తి-పాడేరు : మండలంలోని చీడిమెట్ పివిటిజి గ్రామంలో నిర్వహించిన వైద్య శిభిరాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి జమాల్ బాష సోమవారం తనిఖీ చేసారు. ఈ సందర్భంగా నిర్వహించిన మలేరియా పరీక్షలలో అందరికీ నెగటివ్ వచ్చిందని తెలిపారు. బిపి, షుగర్, హెచ్‌బి టెస్టులు నిర్వహించి వారికీ తగు వైద్య సలహాలు, సూచనలు అందించి అవసరమైన మందులు అందించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ మాట్లాడుతూ, వైద్య అవసరాలకు నేటివ్ డాక్టర్లు, మందులు పై ఆధార పడకుండా దగ్గరలోని ప్రాధమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి చికిత్స తీసుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, డెంగ్యు, మలేరియా సోకకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మూడ నమ్మకాలు విడనాడాలని, కుటుంభ నియంత్రణ పాటించాలని కోరారు..

గిరిజనుడి షాపునకు తాళం

ప్రజాశక్తి-హుకుంపేట:-మండల కేంద్రంలో గిరిజనేతర వైస్ సర్పంచ్ కోడిదాసు గోవింద్ దౌర్జన్యాలకు అడ్డూ అదుపు లేకుండా పోతుంది. ప్రశాంత్ అనే గిరిజనుడు రోడ్ పక్కన ప్రభుత్వం భూమిలో ఏర్పాటు చేసుకున్న ఇంటర్ నెట్ షాపు తనదే నని తాళం వేసిన ఘటన హుకుంపేట మండల కేంద్రం లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే .. కోడి దాసు గోవింద్ గిరిజనులనే తన బినామీలుగా మార్చుకుని మొదమాంబ గుడి పక్కనే ఓ త్రిబుల్ బెడ్ రూమ్ స్లాబ్ , పెట్రోల్ బంక్ ఎదుట టిఫిన్ సెంటర్, కిరాణా షాపు,ఆటో బైక్ మెకానిక్ స్పేర్స్ షాప్, అంబేద్కర్ విగ్రహం వెనకాలే రెండు పోర్షన్ ల పెంకుటిల్లు ఉన్నాయి. అయినా ఆశ తీరక, హుకుంపేట ప్రాధమిక ఆరోగ్య కేంద్రంలో కాంపౌండర్‌గా పని చేస్తున్న గడుతూరి చిన్న బాబును బినామీ గా చేసుకుని, ఇంటర్ నెట్ షాపు కు తాళం వేశాడు. గోవింద్‌పై చర్యలు తీసుకోవాలని గిరిజన ప్రజా సంఘల నేతలు డిమాండ్ చేశారు

ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి -పాడేరు: ప్రభుత్వ పెన్షనర్ల సంఘం అల్లూరి జిల్లా కమిటీ నూతనంగా ఏర్పాటు చేశారు. విశాఖపట్నం జిల్లా సంఘ అధ్యక్షులుగా ప్రసాద్‌రావు కార్యదర్శిగా కృష్ణమూర్తి ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పి.వి. రమణమూర్తి ఆధ్వర్యంలో సోమవారం అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో సమావేశమై ఈ కమిటీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అల్లూరి జిల్లా గౌరవ అధ్యక్షులుగా టి అప్పారావు, అధ్యక్షులుగా ఆర్.నాగభూషణ్ రాజు నియమితులయ్యారు. ప్రధాన కార్యదర్శిగా జి.శ్రీహరి రావు, కోశాధికారిగా మోహన్ రావు నియమితులయ్యారు. సంఘ ఉపాధ్యక్షులుగా మరో ఆరుగురు, సంయుక్త కార్యదర్శి, ముఖ్య సలహాదారులుగా నలుగురు, ప్రచార కార్యదర్శిగా మచ్చయ్య నియమితులయ్యారు.

ఏపిటిఎఫ్ నేతల సమావేశం

ప్రజాశక్తి-హుకుంపేట:ఏపిటిఎఫ్ మండల సర్వసభ్య సమావేశం మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ నూతన సభ్యత్వం నమోదు, సంఘం బలోపేతం, ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించారు. సభ అధ్యక్షులు ఎం సత్యారావు ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా జీవోల కమిటీ కన్వీనర్ ఎల్‌వి. దొర, జిల్లా కార్యదర్శి బట్టి చిన్నారావు, మండల మాజీ అధ్యక్షులు రాజు, ప్రభాకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు రత్నకుమారి, రమ్య ప్రియా, శాంతి కుమారి, పార్వతమ్మ, కంఠమనాయుడు, గోపాలరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు

ఘనంగా వైఎస్ఆర్ జయంతి

ముంచంగిపుట్టులో కేక్ కట్ చేస్తున్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సుభద్ర

ప్రజాశక్తి-యంత్రాంగం

పాడేరు:కీర్తిశేషులు డాక్టర్ వైయస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలు పురస్కరించుకుని సోమవారం అల్లూరి జిల్లా కేంద్రంతో పాటు పలు ప్రాంతాల్లో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైసిపి జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే కొత్తపల్లి భాగ్యలక్ష్మి తో పాటు స్థానిక ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజు పార్టీ నాయకులు కార్యకర్తలు స్థానిక అంబేద్కర్ సెంటర్లోని వైయస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాడేరు ప్రాంతీయ జిల్లా హాస్పిటల్‌లో శాసన సభ్యులు విశ్వేశ్వరరాజు రోగులకు పాల్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ, వైయస్ రాజశేఖర్ రెడ్డి ఆరోగ్య శ్రీ, 108, రైతులకు పోడు భూమి పట్టాల పంపిణీ, ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీ, పేదవాడికి ఇల్లు వంటి ఎన్నో ప్రవేశ పెట్టారన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మరెన్నో సంక్షేమ పథకాలు అమలు చేసి రాష్ట్ర ప్రజలకు మేలు చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ కూతంగి సూరిబాబు, పిఎసిఎస్ చైర్మన్ లకే రామ సత్యవతి, వైస్ ఎంపీపీ కుంతూరు కనకలమ్మ, ఎస్టీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కూడా సురేష్ కుమార్, ఎస్టీ సెల్ జోనల్ ఇంచార్జ్ కిముడు విశ్వ శ్రీను, జిల్లా పంచాయితీ రాజ్ అధ్యక్షులు గబ్బడ చిట్టిబాబు, జిల్లా సోషల్ మీడియా అల్లూరు జిల్లా కన్వీనర్ తడబరికి సురేష్ కుమార్, సర్పంచులు వనుగు బసవన్న దొర, వంతల రాంబాబు, కుర్ర బోయిన సన్నీ బాబు, కొర్ర రాంనాయుడు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు:మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర, మండల పార్టీ అధ్యక్షులు పాంగి పద్మారావులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సుభద్ర మాట్లాడుతూ, అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నరాని కొనియాడారు. అనంతరం స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో రోగులకు పాలు, రొట్టెలు, పండ్లు, పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అరిసెల సీతమ్మ, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతి వేడుకలు సోమవారం స్థానిక గాంధీ బొమ్మ సెంటర్‌లో వైసీపీ మండల కన్వీనర్ సింగిరెడ్డి రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, సర్పంచ్ ల సమైక్య అధ్యక్షులు కె.మురళీకృష్ణ తదితరులు వైఎస్ఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళు లర్పించారు. కార్యక్రమంలో సర్పంచులు గణలక్ష్మి, చీడి శివ, ఎంపీటీసీ కనిగిరి గంగ దుర్గా, వైస్ ఎంపీపీ జుర్ర రాజేశ్వరి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

మారేడుమిల్లి : స్థానిక వైసిపి కార్యాలయంలో ఆ పార్టీ మండల అధ్యక్షులు సత్తి సత్యనారాయణ రెడ్డి, ఎంపీపీ కుమారి లలిత కుమారి, మండల నాయకులు వైయస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లక్కొండ రవి కుమార్, కో ఆప్షన్ నెంబర్ గురుకు ధర్మ రాజు, ఉప సర్పంచ్ బొడ్డేటి వీర బాబు, మాజీ ఎంపీటీసీ గొర్లె అనీల్ ప్రసాద్ (బాబీ), సెక్రటరీ బొడ్డేటి గంగరాజు, నాయకులు బలుసుమిల్లి వెంకట్రావు (చంటి), గొర్లె అనుదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీలేరు : జీకే వీధి మండలం సీలేరు దుర్గాదేవి షెడ్‌లో వైఎస్ఆర్ చిత్రపటానికి ఎంపీటీసీ పిల్ల .సాంబమూర్తి సర్పంచి దుర్జో, వైసిపి నాయకులు పూలమాలలు, కేక్ కట్ చేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎస్‌కే.సుభాన్, వివిధ పార్టీల నాయకులు, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

కొయ్యూరు : మండలంలోని కంతారం గ్రామంలో వైస్ ఎంపీపీ అప్పన వెంకటరమణ, బీసీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ గాడి నాగమణి, వైసిపి నాయకులు గాడి సత్యనారాయణ ఆధ్వర్యంలో రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు బండి సుధాకర్, అప్పన గజ్జయ్య దొర, రేగటి ముసలి నాయుడు, పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

కొయ్యూరు మండలంలో....

కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

జడ్డంగిలో ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరిషదేవి, తెలుగుయువత నియోజకవర్గ అధ్యక్షులు ఎం.విజయ భాస్కర్ ఆధ్వర్యాన రాజమండ్రి గౌతమి నేత్రాలయం అనుబంధ సంస్థ శ్రీకిరణ్ ప్రాథమిక కంటి ఆసుపత్రి వారు సోమవారం మండలంలోని జడ్డంగి సచివాలయం వద్ద ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 150 మందికి కంటి వైద్య పరీక్షలు చేశారు. వారిలో 20మందికి కంటి ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. మరో 40మందికి కళ్లజోళ్లు ఇవ్వడం జరుగుతుందని ఆసుపత్రి కంటి వైద్య నిపుణులు జయరావు, ఉమామహేశ్వరి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది మహేశ్వరరావు, అనిల్, తెలుగుయువత మండల అధ్యక్షుడు బారంగి అనుదీప్, తెలుగుదేశం నాయకులు గణజాల తాతారావు, వాసంశెట్టి గంగాధర్, చెక్కా పండుబాబు, తెడ్ల రాంబాబు, కోపూరి రత్నం, సాగి చిన్నమ్ములు, రేలంగి శ్రీను, తోట వీరబాబు, గణజాల మల్లిఖార్జున, తెడ్ల శ్రీకాంత్, కంటపురెడ్డిశ్రీను, గణజాల బాల గంగాధర్, వల్లూరి మణికంఠ రవితేజ, కాకూరి చినబాబు తదితరులు పాల్గొన్నారు.

విఆర్ఓ మృతికి రెవెన్యూ ఉద్యోగుల సంతాపం

ప్రజాశక్తి - దేవీపట్నం : రంపచోడవరం గ్రామ రెవెన్యూ అధికారి మిర్తివాడ గణపతి రెడ్డి ఆదివారం తెల్లవారుజామున ఆకస్మికంగా మృతి చెందిన నేపథ్యంలో దేవీపట్నం తహశీల్దారు, మండల రెవెన్యూ అధికారులు, సిబ్బంది సోమవారం సంతాపం తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గణపత్తి రెడ్డి గతంలో దేవీపట్నం మండలంలో సుమారు పదేళ్లపాటు విఆర్ఓగా సేవలు అందించారని తెలిపారు. రెవెన్యూ అసోసియేషన్‌లో కూడా చురుగ్గా పని చేశారని, ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్ళడానికి కృషిచేసేవారని పేర్కొన్నారు. ఆయన మరణం చాలా బాధకరమన్నారు. కార్యక్రమంలో దేవీపట్నం రెవెన్యూ కార్యాలయ సిబ్బంది, విఆర్ఒలు, విఆర్ఎలు, విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

సమస్యలపై ఆదివాసీ జెఎసి నిరసన

ప్రజాశక్తి-రంపచోడవరం : ఏజెన్సీలోని పలు సమస్యలపై ఆదివాసీ జెఎసి నాయకులు సోమవారం స్థానిక ఐటిడిఎ ఎదుట నిరసన తెలియజేశారు. అనంతరం సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ మాట్లాడుతూ దేవీపట్నం మండల ముసురుమిల్లి ప్రాజెక్టు కాలువకు లష్కర్‌లను నియమించి దేవారం, శరభరం రైతులకు సాగునీరు అందించాలని, ఏజెన్సీలో పాత అంగన్వాడీ భవనాలను తొలగించి కొత్తవి మంజూరు చేయాలని, కొండపోడు పట్టాలకు రీ సర్వే చేసి అప్పగించాలని, చెరువులకు తూములు వేయాలని, కల్వర్టులు నిర్మించాలని, ఏపీ టెట్, డీఎస్సీ అభ్యర్థులకు ఐటిడిఏ ఆధ్వర్యంలో ఉచిత కోచింగ్, వసతి కల్పించి, స్టడీ మెటీరియల్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కొండ దొరల జిల్లా సంఘం నాయకులు యలగాడ నాగేశ్వరరావు, దూసరి హరిబాబు, కొల్లాపు శ్రీధర్, టెంకీ రాంబాబు ఇతర నాయకులు పాల్గొన్నారు.

తిరుమల ఎక్స్‌ప్రెస్ రద్దు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : దక్షిణ మధ్య రైల్వేలోని విజయవాడ న్యూ వెస్ట్ క్యాబిన్ బ్లాక్ హట్ - విజయవాడ స్టేషన్ మధ్య మూడో లైన్ కోసం ప్రీ -నాన్ ఇంటర్ లాకింగ్ / ఇంటర్ లాకింగ్ పనులు జరుగుతున్న కారణంగా 17488 విశాఖపట్నం - కడప తిరుమల ఎక్స్‌ప్రెస్‌ను ఆగస్టు 5 నుంచి 10 వరకు, 17487 కడప - విశాఖపట్నం తిరుమల ఎక్స్‌ప్రెస్‌ను ఆగస్టు 6 నుంచి 11 వరకు రద్దు చేశారు. అలాగే పలు రైళ్లను దారి మళ్లిస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు.

కెజిహెచ్ ఆరోగ్యశ్రీ డిసిగా డాక్టర్ అప్పారావు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కెజిహెచ్ ఆరోగ్యశ్రీ డిసిగా డాక్టర్ కె.అప్పారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన పార్వతీపురం మన్యం జిల్లా ఆరోగ్యశ్రీ డిసిగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. సోమవారం జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరీంద్ర ప్రసాద్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు.

ఉచిత ఇసుకపై రగడ

నిల్వలపై అయ్యన్న, ఉమాశంకర్ పరస్పర విమర్శలు
గబ్బాడలో వాయిదా - ఇరకాటంలో అధికారులు
నక్కపల్లిలో ఆలస్యంగా ప్రారంభం

గబ్బాడలోని ఇసుక డిపో

ప్రజాశక్తి- అనకాపల్లి ప్రతినిధి, నక్కపల్లి, నర్సీపట్నం రూరల్ విలేకర్లు

జిల్లాలోని నర్సీపట్నం గబ్బాడ డిపోలో ఇసుక నిల్వలపై టిడిపి, వైసిపి పరస్పర విమర్శలతో ఉచిత ఇసుక విధానం ప్రారంభానికి ఆటంకం ఏర్పడింది. జిల్లాలో నక్కపల్లి, గబ్బాడలో ఇసుక డిపోలున్నాయి. సోమవారం నుంచి ఉచిత ఇసుక విధానం అమల్లోకి తీసుకొస్తామన్న ప్రభుత్వం మధ్యాహ్నం వరకు విధివిధానాలు విడుదల చేయలేదు. దీంతో అధికారులు ఉచిత ఇసుక ప్రారంభంపై మార్గదర్శకాలు వచ్చే వరకు వేచిచూశారు. ఉచిత ఇసుకపై ప్రభుత్వం జిఒ విడుదల చేశాక సాయంత్రం ఆరు గంటల తరువాత నక్కపల్లిలో ఉచిత ఇసుక విధానాన్ని అధికారులు ప్రారంభించారు. గబ్బాడలో మాత్రం ఇరు పార్టీల నాయకుల విమర్శలతో ప్రారంభించడానికి అధికారులు సాహసించలేకపోయారు. ఇసుక డిపోలోని నిల్వలపై విచారణకు శాసనసభ స్పీకర్, నర్సీపట్నం ఎమ్మెల్యే అయ్యన్న పాత్రుడు ఆదేశించారు. బాధ్యులపై కేసు నమోదు చేసిన తరువాత మాత్రమే ఇసుక అమ్మకాలు ప్రారంభించాలని డిమాండ్ చేయడంతో అధికారులు ఇరకాటంలో పడ్డట్లయింది.

దీనికి ప్రతిగా ఇసుక నిల్వలను తక్కువచేసి చూపించి తరువాత అమ్ముకోవడానికి టిడిపి నాయకులు ప్రయత్నిస్తున్నారని నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ విమర్శించారు. ఇసుక డిపోలో దాదాపు 80 వేల టన్నుల ఇసుక వున్నప్పటికీ, 40 వేల టన్నులు వుందని చెప్పి, తరువాత ఆ ఇసుకను అమ్మి సొమ్ము చేసుకుందామని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఈ ఏడాది జనవరి నుంచి డిపోకు వచ్చిన ఇసుకలో జరిగిన విక్రయాలు, నిల్వలపై సమాచారం రికార్డుల ప్రకారం వెల్లడించాలని గణేష్ డిమాండ్ చేస్తున్నారు. ఇసుక నిల్వలపై ఇరు పార్టీల నాయకుల విమర్శలతో గబ్బాడలో ఉచిత ఇసుక కార్యక్రమం సోమవారం వాయిదా పడింది.

ఇదిలావుండగా నూతన ఇసుక విధానంపై ప్రభుత్వం ధర నిర్ణయించడం విమర్శలకు తావిస్తోంది. గత ప్రభుత్వం టన్ను ఇసుక ధర రూ.1400కు విక్రయించగా, కూటమి ప్రభుత్వం ఉచితంగా ఇసుక సరఫరా చేస్తామని హామీ ఇచ్చి టన్ను ఇసుక ధరను రూ.1225గా నిర్ణయించింది. టన్ను ఇసుక ధర రూ.1225 అని ఇసుక డిపోల వద్ద అధికారులు ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వానికి, ఈ ప్రభుత్వానికి ఇసుక టన్ను ధర వ్యత్యాసం రూ.175 మాత్రమే ఉండడంతో వినియోగదారులు పెదవి విరుస్తున్నారు.

మూడు రోజులైనా..

దొరకని నిందితుని ఆచూకీ

బాలిక హత్య కేసుపై పోలీసు దర్యాప్తు ముమ్మరం
గాలింపు చర్యల్లో 20 బృందాలు
నిందితున్ని శిక్షించాలని ఎస్ఎఫ్ఐ, ఐద్వా ఆందోళనలు

ప్రజాశక్తి - రాంబిల్లి : మండలంలోని కొప్పుగొండుపాలెం గ్రామంలో మైనర్ బాలిక హత్యకు గురై మూడు రోజులైనా నిందితుని ఆచూకీ లభ్యం కాలేదు. శనివారం సాయంత్రం ఈ ఘటన జరిగింది. ప్రేమోన్మాది సురేష్ కత్తితో అతి కిరాతకంగా తొమ్మిదో తరగతి చదువుతున్న బద్ది దర్శినిని పొడిచి చంపాడు. అనంతరం అతడు సమీపంలోని కాంపౌండ్ వాల్ దాటి తూర్పు వైపుగా కొబ్బరి తోటలోంచి పారిపోయాడు. నేవీ గోడను అనుకొని ఉన్న కొత్తపేట - గోవిందపాలెం వైపుగా అతడు వెళ్లడం చూశామని కొందరు చెబుతున్నారు. మరోవైపు పోలీసులు కేసు దర్యాప్తును ముమ్మరం చేశారు. నిందితున్ని పట్టుకునేందుకు ముగ్గురు డిఎస్‌పిల పరిధిలో 20 టీములు గాలింపు చర్యలు చేపడుతున్నాయి. ఇదిలా ఉండగా నిందితున్ని నేటికీ పట్టుకోకపోవడంపై గ్రామస్తులు, ప్రజా సంఘాల నాయకులు భగ్గుమంటున్నారు. ఫోక్సో చట్టం కింద అరెస్టయి, బెయిల్‌పై బయటకు వచ్చిన నిందితునిపట్ల పోలీసులు అప్రమత్తంగా లేకపోవడం వల్లనే ఈ ఘటన జరిగిందని ఐద్వా నేతలు చెబుతున్నారు. బాధిత కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్‌కి వెళ్లి మూడు పర్యాయాలు నిందితుని వల్ల దర్శిని ఇబ్బంది పడుతోందని చెప్పినప్పటికీ పోలీసులు సరైన చర్యలు చేపట్టకపోవడంపై మండిపడుతున్నారు. బాలిక హత్య కేసులో నిందితున్ని కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యాన సోమవారం రాంబిల్లి, నర్సీపట్నం, యలమంచిలి ప్రాంతాల్లో ఆందోళనలు చేపట్టారు.

గ్రామాన్ని సందర్శించిన బాలల హక్కుల కమిషన్

కొప్పుగుండుపాలెంలోని బాధిత కుటుంబాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, సభ్యులు గొండు సీతారాం, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు గెడ్డం ఉమ సోమవారం పరామర్శించారు. దారుణ ఘటనపై విచారం వ్యక్తం చేశారు. డ్రగ్స్, ఫోక్సో కేసుల్లో బెయిల్‌పై విడుదలైన వారిపై పోలీసులు పూర్తి స్థాయిలో పర్యవేక్షణ ఉంచాలని అన్నారు. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న నేటి కాలంలో యువత పెడదోవ పట్టడంపై ఆందోళన వ్యక్తం చేశారు. పోలీసు, స్త్రీ, శిశు సంక్షేమ శాఖలు, ప్రభుత్వ విభాగాలు మరింత సమన్వయంతో పనిచేయాల్సి ఉందన్నారు. ఫోక్సో, ఇతర బాలల చట్టాలపై ప్రాథమిక తరగతి నుంచే అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉందన్నారు. దర్శిని కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు అధికారి ఇందిరాదేవి, సిబ్బంది శశికళ, పర్యవేక్షక అధికారి రాణి, మిషన్ వాత్సల్య సిబ్బంది లక్ష్మి, లోవరాజు పాల్గొన్నారు.

చెక్కు అందజేస్తున్న బ్యాంకు అధికారులు

మృతురాలి కుటుంబానికి బీమా చెక్కు అందజేత

ప్రజాశక్తి - కొయ్యూరు : మండలంలోని మంప పంచాయతీ పరిధి కించవానిపాలెంలో ఇటీవల మృతి చెందిన కంకిపాటి సరస్వతి కుటుంబానికి బీమా చెక్కును ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు అధికారులు సోమవారం అందజేశారు. కంకిపాటి సరస్వతి గతంలో ఏపీజీవీ బ్యాంకులో రూ.456తో బీమా ప్రారంభించారు. కాగా ఆమె ఇటీవల మరణించడంతో బీమా కింద మంజూరైన రూ.2 లక్షల చెక్కును ఆమె భర్త కంకిపాటి చంద్రరావుకు బ్యాంక్ రీజనల్ మేనేజర్ సతీష్ చంద్ర, బ్రాంచ్ మేనేజర్ సతీష్ కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏపీజీవి బ్యాంకులో బీమాను అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

బాధితునికి టిడిపి నేతల బాసట

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా బ్లాస్టింగ్ చేయడం వల్ల రాళ్లు ఎగిరి పడి మండలంలోని సింగంపల్లి గ్రామ శివారులో నివాసముంటున్న పల్లి ప్రసాద్ రేకుల ఇంటిపై పడుతున్న నేపథ్యంలో బాధితునికి టిడిపి నేతలు బాసటగా నిలిచారు. బ్లాస్టింగ్ చేస్తున్న సమయంలో ఆ ఇంట్లో వున్న చిన్నపిల్లలతో సహా అందరూ కిలో మీటరు వెళ్ళి అక్కడవుండి, బ్లాస్టింగ్ అయిన తర్వాత తిరిగి ఇంటికి వస్తున్నారు. రాళ్లు పడి ఇంటి పైకప్పు రేకులు శిథిలం కాగా, వాటిని తిరిగి వేయాలని సంబంధిత కాంట్రాక్టర్లను కోగా, వారు నిర్లక్ష్య సమాధానాలు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో బాధితుడు టిడిపి నాయకును ఆశ్రయించారు. దీంతో టిడిపి మండల నాయకులు గనజాల తాతారావు, ఇతర నాయకులు సోమవారం బాధితుడిని పరామర్శించి, సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. వారి సమస్యలు విన్న టిడిపి నాయకులు జాతీయ రహదారి నిర్మాణ పనుల కాంట్రాక్టరుతో మాట్లాడారు. బాధితుని ఇంటి సమీపంలో బ్లాస్టింగ్ పనులు వెంటనే పూర్తి చేసి, వారం పదిరోజుల్లో వారి ఇంటికి కొత్త సిమెంట్ రేకులు సమకూర్చాలని టిడిపి నాయకులు కోరారు. దీనికి కాంట్రాక్టరు అంగీకరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వాసంశెట్టి గంగాధర్, చెక్కా పండుబాబు, తెలుగు యువత నాయకులు బారంగి అనుదీప్, కంటపురెడ్డి వీరబాబు, తెడ్ల రాంబాబు, మాజీ సర్పంచ్ కోపూరి రత్నం, గణజాల మల్లిఖార్జున, సాగి చిన్నమ్ములు, రేలంగి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో తుప్పల తొలగింపు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని సింగంపల్లి ఆశ్రమ పాఠశాల ఆవరణలో కొంతకాలంగా పిచ్చి మొక్కలు, తుప్పలు విపరీతంగా పెరిగిపోవడంతో తమ సమస్యలను ఫోన్ ద్వారా విద్యార్థినులు ఎమ్మెల్యే శిరీష దేవికి తెలియజేశారు. దీంతో ఆమె చొరవతో సోమవారం తుప్పులు, పిచ్చి మొక్కలను తొలగించారు. తుప్పలు వల్ల పురుగులు, దోమలు విషసర్పాలు ఎక్కువ కావడంతో భయాందోళనకు గురైన విద్యార్థినులు స్థానికంగా ఉన్న పాఠశాల సిబ్బందికి, టిడిపి నాయకులకు తెలియజేశారు. ఈ విషయం ఫోన్లో ఎమ్మెల్యే శిరీష దేవికి తెలియజేశారు. తక్షణం స్పందించిన ఎమ్మెల్యే శిరీష విజయభాస్కర్ దంపతులు ఆ ప్రాంతంలో తుప్పలను తొలగించాలని ఆదేశిచడంతో ఒట్టిగడ్డకు చెందిన ప్రజాప్రతినిధుల సమక్షంలో తుప్పలను తొలగించారు.

ముగిసిన కేశవరావు మెమోరియల్ టేబుల్ టెన్నిస్ టోర్నీ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కేశవరావు మెమోరియల్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ సోమవారం సాయంత్రం విశాఖపట్నం రైల్వే ఇండోర్ స్టేడియంలో ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రైల్వే స్పోర్ట్స్ ఇన్‌స్పెక్టర్ రెడ్డి శ్రీనివాస్, విశాఖ జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు సర్వభౌమ, టోర్నమెంట్ నిర్వాహకులు మురళి పాత్రో హాజరయ్యారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేసారు. ఈ టోర్నమెంట్‌ను విశాఖపట్నం జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ సెక్రటరీ డాక్టర్ డివిఎస్‌వై.శర్మ కో-ఆర్డినేట్ చేశారు.